సాక్షి
మంచిర్యాల
గురువారం । 14 । నవంబర్ । 2024



మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

మత్స్యకార సంఘాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. బుధవారం ఆయన భీమారం, చెన్నూర్ మండలాల్లో పర్యటించారు. 9లో▸

'ఆశ్రమాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి'

మంచిర్యాలటౌన్: జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం కోసం నిర్వహించే ఆశ్రమాలు, పాఠశాలలు, వివిధ సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి జి.స్వరూపరాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 14న సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ లేని సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇతర వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 155326లో సంప్రదించాలని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
31.0 /20.0

వాతావరణం

ఉదయం ఆకాశం ప్రకాశవంతంగా, రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఇంటిపన్నులు వసూలు చేయాలి



కులగణన సర్వేను పరిశీలిస్తున్న డీపీవో

కాసిపేట: గ్రామ పంచాయతీల్లో నెలాఖరు వరకు వందశాతం ఇంటిపన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం మండలంలోని ముత్యంపల్లి గ్రామ పంచాయతీలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు నిరంతరం చేయాలని ఆదేశించారు. రోజువారీగా సేకరించిన తడిపొడి చెత్తను కంపోస్టు ఎరువు తయారు చేయించాలని, పొడి చెత్తను రీసైక్లింగ్‌కు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నర్సరీలు లక్ష్యాలను అనుగుణంగా మూడు రోజుల్లో సిద్ధం చేయాలని తెలిపారు. కులగణన సర్వే తీరును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అన్ని వివరాలు సేకరించి పూరించాలని ఆదేశించారు. ఇంచార్జి డీఎల్‌పీవో, ఎంపీవో షేక్ సబ్దర్ అలీ, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై ఆరోపణలు మానుకోవాలి'



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్లు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆరోపణలు మానుకుని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని మంచిర్యాల, నస్పూరు మున్సిపల్ చైర్మన్లు రావుల ఉప్పలయ్య, సురిమిల్ల వేణు, కాంగ్రెస్ మంచిర్యాల పట్టణ, హాజీపూర్ మండల అధ్యక్షుడు తూముల నరేశ్, తోట రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏ వన్ కాంట్రాక్టర్‌గా పని చేసిన అనుభవం ఎమ్మెల్యేకు ఉందన్నారు. ఓటు వేయలేదనే అక్కసుతో మార్కెట్ రోడ్డులో కూల్చివేతలను చేస్తున్నారనే ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రజలు ఓటు ఎవరికి వేశారని ఎలా తెలుస్తుందో రఘునాథ్ చెప్పాలని డిమాండ్ చేశారు. అక్రమ కట్టడాలను తొలగించి, రోడ్డు వెడల్పు చేయడం వల్ల మంచిర్యాలకు వచ్చే ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తప్పుతాయని, భవిష్యత్ తరాలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

'సర్వేను అడ్డుకుంటున్న పార్టీలతో బీసీలకు అన్యాయం'



మాట్లాడుతున్న వడ్డేపల్లి మనోహర్

పాతమంచిర్యాల: రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వేను అడ్డుకుంటున్న బీఆర్‌ఎస్, బీజేపీలతో బీసీలకు అన్యాయం జరుగుతోందని బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా కులగణన చేయాలనే ప్రజల డిమాండ్‌తో తెలంగాణ ప్రభుత్వం కులగణన చేపట్టిందని తెలిపారు. ఆయా పార్టీలు కులగణనను అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రలోని బీజేపీ, రాష్ట్రంలోని ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీలు బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మేలును స్వాగతించాలని అన్నారు. అగ్రకులాలకు పేదల పేరిట ఉద్యోగావకాశాల్లో దోపిడీ చేస్తున్న ఈడబ్ల్యూఎస్ 10శాతం రిజర్వేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ ఐక్య వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు అంజన్న, యువజన అధ్యక్షుడు పెద్దల చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ఆందోళన

భీమిని: మండలంలోని వెంకటపూర్ గ్రామంలో ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు నిరసనకు దిగిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వెంకటాపూర్ గ్రామానికి చెందిన పుట్ట శ్రీకాంత్ తనను ప్రేమ పేరిట లొంగదీసుకుని ఇప్పుడు దూరం పెడుతున్నాడని కన్నెపల్లి మండలం ఐదపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి బైఠాయించింది. తనను గర్భవతిని చేశాడని, తనకు శ్రీకాంత్‌తో వివాహం జరిపించాలని ఆస్పత్రి రిపోర్టులతో నిరసనకు దిగింది. దీంతో శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయాడు. కన్నెపల్లి ఎస్సై గంగారాం యువతికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఆమెను ఐదపల్లికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైలు ప్రయాణం ఆలస్యం

- యుద్ధప్రాతిపదికన పట్టాల పునరుద్ధరణ
- నేటి వరకు రెండు ట్రాక్‌లు అందుబాటులోకి
- రెండ్రోజులు రైళ్ల రద్దు.. ప్రయాణికుల ఇబ్బందులు



రైళ్ల రద్దుతో స్టేషన్ ఆవరణలోనే ప్రయాణికుల పడిగాపులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రామగుండం, రాఘవపురం మధ్య మంగళవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో గత రెండ్రోజులుగా రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే రంగంలోకి దిగిన రైల్వే అధికారులు యుద్ధ ప్రాతిపదికన ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. బుధవారం సాయంత్రం వరకు ఒక ట్రాక్ అందుబాటులోకి రాగా.. గురువారం వరకు మరొకటి అందుబాటులోకి రానుంది. మూడు ట్రాక్‌లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావాలంటే రెండ్రోజులు పట్టే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ప్రతీ రోజు బల్లార్షా నుంచి కాజీపేట, వరంగల్, కరీంనగర్ మధ్య నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అంతేగాక వస్తు, ముడిసరుకుల రవాణా పెద్ద ఎత్తున జరుగుతుంది. సింగరేణి నుంచి బొగ్గు, సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి సిమెంట్, ఇతర సరకు రవాణా జరుగుతుంది. ఉత్తర దక్షిణ భారతదేశాన్ని కలిపేందుకు కీలక మార్గంగా ఉన్న ఈ రూట్‌మీదుగా కాజీపేట నుంచి కాగజ్‌నగర్ వరకు అనేక మందికి ప్రయాణానికి ఉపయుక్తంగా ఉంది. అనుకోని ఘటన జరగడంపై రైల్వే అధికారులు ప్రమాదం జరిగిన కారణంపై విచారణ చేపట్టారు. సమస్య పరిష్కారానికి గత రెండ్రోజులుగా రాత్రింబవళ్లు సాంకేతిక నిపుణులు, అధికారులు, సిబ్బంది ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు.



నిర్మానుష్యంగా మంచిర్యాల రైల్వేస్టేషన్

రైళ్ల రద్దు, మళ్లింపు

ట్రాక్ పనులు పూర్తయ్యే వరకు రైళ్లన్నీ రద్దు చేశారు. కొన్ని రైళ్లను పాక్షికంగా దారి మళ్లించారు. పెద్దపల్లి నుంచి కరీంనగర్ మీదుగా నిజామాబాద్ వరకు, మరికొన్నింటిని బల్లార్షా, నాగ్‌పూర్, మైజ్రి, సేవాగ్రామ్ జంక్షన్ల నుంచి మళ్లించారు. సికింద్రాబాద్, విజయవాడ, నాగ్‌పూర్ సూపర్‌ఫాస్ట్‌లను ఆయా జంక్షన్ల గుండా మళ్లించారు. దీంతో ప్రయాణం గంటల కొద్దీ ఆలస్యంగా సాగుతోంది. ఈ ప్రాంత వాసులు హైదరాబాద్‌కు వెళ్లేందుకు రద్దీగా ఉండే భాగ్యనగర్, ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ సూపర్ ఫాస్ట్, దానాపూర్ వంటి కీలక రైళ్లు రద్దు కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు రైల్వేస్టేషన్లలోనే పడిగాపులు కాస్తున్నారు. రాత్రి వేళ స్టేషన్‌లోనే చిన్న, పెద్ద అంతా అక్కడే ఉండిపోయారు. ప్రత్యామ్నాయం రోడ్డు మార్గం బస్సుల్లో వెళ్తున్నారు.

రూ.కోట్లలో నష్టం

మంచిర్యాల నుంచి సిర్పూర్ టౌన్ వరకు నిత్యం వేలాది మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. దీంతో రోజువారీగా ప్రయాణం చేసే ఉద్యోగులు, వ్యాపారులకు ఇబ్బంది ఏర్పడింది. ఇక గూడ్స్ రవాణాతోనూ సంస్థకు నిత్యం రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. ఈ క్రమంలో ఈ ఘటనతో ప్యాసింజర్, గూడ్స్ రవాణా నిలిచి రైల్వేకు రూ.కోట్లలోనే నష్టం వాటిల్లింది. గత ఏడాదిగా పలు కారణాలతో తరచూ రైళ్ల రద్దుతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. తాజాగా ఈ ఘటనతోనూ మళ్లీ ఇబ్బంది ఏర్పడింది.

గ్రూప్–3 పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నస్పూర్: ఈ నెల 17, 18వ తేదీల్లో గ్రూప్–3 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి బుధవారం డీజీపీ జితేందర్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, పబ్లిక్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ గ్రూప్ 3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. మహిళల కోసం ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, అన్ని వసతులు కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, అధికారులు బ్రహ్మారావు, శ్రీకళ, షాబొద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా వంద సీట్లే..!



ఇటీవల ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు, తల్లిదండ్రులు

- ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 150కి పెరగని సీట్లు
- సొంత భవనం, పూర్తి స్థాయిలో ఆస్పత్రి లేకపోవడమే కారణం
- సరిపడా ఫ్యాకల్టీ, మౌలిక వసతుల కల్పన కరువు
- ప్రజాప్రతినిధులు కృషి చేస్తే వచ్చే ఏడాదికైనా అనుమతి

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి 150 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించగా.. మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ 100 సీట్లకే పరిమితమైంది. గత మూడేళ్లుగా సీట్ల సంఖ్య పెరగకపోవడంతో ఈ ప్రాంత విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోంది. 2022లో మెడికల్ కాలేజీకి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో 150సీట్లతో అనుమతి ఇచ్చారు. కాలేజీ రోడ్డు వ్యవసాయ మార్కెట్‌లోని గోదాములను కళాశాల కోసం సిద్ధం చేశారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో పడకలు లేక, వైద్య సేవలు అందక, సరిపడా సిబ్బందిని నియమించకపోవడంతో నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్‌ఎంసీ) 100 సీట్ల భర్తీకి మాత్రమే అనుమతి ఇచ్చింది. బయోకెమిస్ట్రీ, అనాటమీ డిపార్ట్‌మెంట్లు, లెక్చర్ హాళ్లు, ల్యాబ్‌లను సిద్ధం చేసినా గోదాముల్లో కాలేజీకి అనుమతి ఇవ్వడంపై వెనుకంజ వేసింది. అప్పటి ప్రభుత్వం అనుమతి కోసం ప్రత్యేక చొరవ చూపడంతో 100 సీట్లకు మాత్రమే అనుమతి లభించింది. గత మూడేళ్లుగా యేటా 100 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో చేరుతున్నారు.

సదుపాయాలు కల్పిస్తేనే..

మెడికల్ కాలేజీలో ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించలేదు. హాజీపూర్ మండలం గుడిపేటలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ స్వంత భవనంతోపాటు ప్రస్తుతం మార్కెట్ యార్డులో కొనసాగుతున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆవరణలోనే 450 పడకలతో నూతనంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నారు. పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కాలేజీ భవన నిర్మాణం పూర్తయితే వైద్య విద్యార్థులకు ల్యాబ్‌లు, హాస్టల్ వసతి, కాలేజీ అన్ని కూడా ఒకేచోట ఉండనున్నాయి. 450 పడకలతో నిర్మిస్తున్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పూర్తయినా వైద్య విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడనుంది. ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు 450 పడకలతో కూడిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వార్డులు, అన్ని రకాల వైద్య సదుపాయాలు అందించేలా ఉండాలి. ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉంటేనే సీట్ల పెంపునకు అనుమతి ఇస్తుంది. స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కృషి చేస్తే కనీసం వచ్చే ఏడాదికైనా 150 సీట్లకు పెంపు ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇప్పటికే ఏడాదికి 50 సీట్ల చొప్పున మూడేళ్లలో 150 సీట్లు నష్టపోవాల్సి వచ్చింది. 2022లో మొదటి సంవత్సరం బ్యాచ్ 100శాతం ఉత్తీర్ణత సాధించగా, 2023 బ్యాచ్ 94 శాతం ఉత్తీర్ణత సాధించారు. 2024లో 100మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో ఇటీవలే చేరారు. గత మూడేళ్లుగా 100 సీట్లనే కౌన్సెలింగ్‌లో కేటాయిస్తున్నారు.

అనుమతి కోసం ప్రయత్నిస్తున్నాం



మెడికల్ కళాశాలకు అవసరమైన అన్ని వసతులతో కూడిన స్వంత భవన నిర్మాణ పనులు, ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది ఈ భవనాలు అందుబాటులోకి వస్తే ఎన్‌ఎంసీ నుంచి 150 సీట్లకు అనుమతి సులభం అవుతుంది. మెడికల్ కాలేజీకి ఫ్యాకల్టీ, సిబ్బందిని కూడా నియమించుకోవాల్సి వస్తుంది. వచ్చే ఏడాది అడ్మిషన్ల సమయానికి 150 ఎంబీబీఎస్ సీట్ల అనుమతి కోసం ప్రయత్నిస్తున్నాం.

– డాక్టర్ ఎండీ.సులేమాన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు

- కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్: సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం నస్పూర్ మున్సిపాలిటీలో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వే వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని చెప్పారు. నమూనాలో ఉన్న అన్ని అంశాలను పూరించాలని తెలిపారు. సర్వే నిర్వహించే ప్రాంతంలో ముందురోజు సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అవసరమైన పత్రాలతో హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన తీగల్‌పహడ్ జెడ్పీహెచ్‌ఎస్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లడుతూ అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, హెచ్‌ఎం రామన్న ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

కొనుగోలు కేంద్రం ప్రారంభం

పట్టణంలోని సీతారాంపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నరకం వడ్లకు మద్దతు ధరతోపాటు అదనంగా రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ వేణు, కమిషనర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కార్తిక పౌర్ణమి జాతరకు వేళాయె

- 15న గూడెంలో జాతర
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

దండేపల్లి: తెలంగాణ అన్నవరంగా ప్రసిద్ధి గాంచిన మండలంలోని గూడెం గుట్టపై సత్యనారాయణస్వామి ఆలయం కార్తిక పౌర్ణమి జాతరకు ముస్తాబైంది. ఈ నెల 15న జాతర నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. వేలాది మంది భక్తులు తరలి రానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. భక్తుల రద్దీకి తగ్గట్టుగా స్వామి వారి దర్శనానికి క్యూలైన్లు, ఎండ తగలకుండా ఉండేందుకు చలువ పందిళ్లు వేశారు. తాగునీటి సౌకర్యం, అదనపు ప్రసాద కౌంటర్లు, అన్నదాన ప్రసాద వితరణ, వాహన పార్కింగ్ స్థలం ఏర్పాట్లు చేశారు. లడ్డు ప్రసాదాలు కూడా సిద్ధం చేశారు. ప్రజల రక్షణ, భద్రత నిమిత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై ఉదయ్‌కిరణ్ పర్యవేక్షిస్తున్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఆదిలాబాద్ సహాయ కమిషనర్ నవీన్‌కుమార్ జాతర ఏర్పాట్లను బుధవారం పరిశీలించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.



చలువ పందిళ్లు, క్యూలైన్లు

భక్తుల రద్దీ..

కార్తికమాసం సందర్భంగా గూడెం సత్యదేవుడి సన్నిధిలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. కార్తిక ద్వాదశిని పురస్కరించుకుని బుధవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సత్యదేవుణ్ని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కార్తీక దీపాలు వెలిగించడంతోపాటు దీపదానాలు చేశారు. 490 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో గూడెం ఆలయ ప్రాంగణాలు సందడిగా మారాయి.

జాతీయసాధన సర్వేలో ప్రతిభ చూపాలి

మంచిర్యాలఅర్బన్: డిసెంబర్ 4న నిర్వహించే జాతీయ సాధన సర్వేలో విద్యార్థులు ప్రతిభ చూపాలని డీఈవో యాదయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో జి ల్లాలోని ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించా రు. డీఈవో మాట్లాడుతూ సాధన సర్వేలో జిల్లాను ముందు వరుసలో ఉంచేందుకు కృషి చేయాలన్నారు. సమగ్రశిక్ష కో–ఆర్డినేటర్లు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ దామోదర్‌రావు, డీసీబీ సెక్రెటరీ భీంరావు, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, ఎంఈవో మలావిదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

కేజీబీవీల్లో చార్జీలు పెరిగేనా..!

- డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపుపై ఎదురు చూపులు
- 6 నుంచి ఇంటర్ వరకు ఒకటే..
- ఒక్కో విద్యార్థికి రూ.1,225
- కాస్మెటిక్స్‌కు రూ.100తోనే సరి



కేజీబీవీలో చదువుతున్న విద్యార్థినులు

మంచిర్యాలఅర్బన్: వసతిగృహాలు, గురుకులాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపుతో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ) విద్యార్థినులు ఎదురు చూస్తున్నారు. కేజీబీవీల్లో ఆరు నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు ఒక్కొక్కరికి నెలకు రూ.1,225 చెల్లిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం హాస్టళ్లు, గురుకులాల్లో 3నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ.1,330, 8నుంచి 10వ తరగతి వరకు రూ.1,540, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు రూ.2,100 డైట్‌చార్జీలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కేజీబీవీల్లో మాత్రం కనీసం హాస్టళ్లు, గురుకులాల్లో చదివే 7వ తరగతిలోపు విద్యార్థులకు చెల్లించే రూ.1,300 కూడా లేకపోవడంపై విద్యార్థినులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని కోరుతున్నారు.

మెనూ ఇలా..

జిల్లాలో 18 కేజీబీవీలు ఉండగా.. 4,450మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. రక్తహీనత, ఇతర అనారోగ్యాల నివారణకు నెలలో ఆరుసార్లు మాంసాహారం, పౌష్టికాహారం అందిస్తోంది. నెలలో 1, 3వ ఆదివారాల్లో మధ్యాహ్నం, 2, 4వ బుధవారాల్లో రాత్రిపూట చికెన్‌తో భోజనం పెట్టాలి. నెలలో 2, 4వ ఆదివారాల్లో మధ్యాహ్నం మేక మాంసంతో భోజనం పెట్టాల్సి ఉంది. వారంలో ఆరు రోజులు బుధవారం మినహా అరటిపండు లేదా సీజనల్ పండ్లు, సేమియా, గులాబ్‌జామ్, అటుకుల మిక్చర్, పల్లిపట్టి, స్నాక్స్, టీ అందించాల్సి ఉంటుంది.

మెనూలోనూ వ్యత్యాసమే..

వసతిగృహాల విద్యార్థులకు డైట్‌చార్జీలు పెంచినా ఆహారం అందించడంలోనూ వ్యత్యాసం ఉంటోంది. కేజీబీవీలు వసతితోపాటు విద్యనందిస్తాయి. వసతిగృహాల్లో ఉంటూ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మధ్యాహ్న భోజనం అక్కడే తింటున్నారు. ఒక్కపూట అల్పాహారం, రాత్రిపూట భోజనం అందించే 3నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1,330 నుంచి రూ.1,500, ఇంటర్ విద్యార్థులకు రూ.2,100 చెల్లిస్తుండడం గమనార్హం. రెండు పూటల భోజనం, ఒక అల్పాహారం అందిస్తున్న కేజీబీవీలకు డైట్‌చార్జీలు రూ.1,225తోనే సరిపెడుతున్నారు. వసతిగృహాల్లో పెంచిన చార్జీల ప్రకారం మెనూ అంతంత మాత్రంగానే అమలవుతోంది. ఐదు రోజులు కోడిగుడ్డు, అరటిపండ్లతోపాటు వారంలో రెండ్రోజులు చికెన్ అందించడం లేదని తెలుస్తోంది. వసతిగృహాల విద్యార్థులు ఉదయం ఉంటే సాయంత్రం ఉంటారో లేదో తెలియదు. బయోమెట్రిక్ వంటివి లేకపోవడం, మ్యానువల్ కావడంతో విద్యార్థుల సంఖ్య ఎంత రాస్తే అంత అన్నట్లుగా మారింది. విద్యార్థుల సంఖ్యను బట్టి చార్జీలు చెల్లిస్తుండడంతో ఎక్కువ రాస్తున్నట్లు తెలుస్తోంది. పర్యవేక్షించాల్సిన అధికారులు మామూలుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మరోవైపు కేజీబీవీల్లో జిల్లా వ్యాప్తంగా ఒకే తీరు కాకుండా టెండర్‌దారులకు వేర్వేరుగా రెండు ధరలు చెల్లిస్తున్నారు. జిల్లాలోని 18 కేజీబీవీల్లో నాలుగు భాగాలు(స్లైబ్ నాలుగు భాగాలు)గా విభజించి నిత్యావసర సరుకుల కోసం టెండర్లు పిలిచినా ధరలు మాత్రం వేర్వేరుగా ఉన్నాయి. మెస్‌చార్జీల హెచ్చుతగ్గుల వల్ల పారదర్శకత లోపిస్తోంది. ఉదాహరణకు స్లైబ్ వన్, త్రీలో ఇలాచి కిలోకు రూ.600 కాగా, స్లైబ్ రెండు, నాలుగులో రూ.1090, కిలో బాగా రా ఆకులు, ఫ్లవర్ ఒకటి, మూడులో రూ.100 కాగా రెండు, నాలుగు విభాగాలకు రూ.135 చెల్లిస్తున్నారు. ఇలా ప్రతీ వస్తువుపై ఒక్కో స్లైబ్‌లో ఒక్కోతీరుగా చెల్లిస్తుండడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

కాస్మెటిక్స్‌కు..

కేజీబీవీ విద్యార్థినులకు ఆరోగ్యకిట్లు అందించేవారు. మూడు నెలకొకసారి సానిటరీ న్యాప్‌కిన్లతోపాటు బాత్‌సోప్స్–3, డిటర్జెంట్ సోప్స్–3, హెయిర్‌బాటిల్–1, షాంపు, పౌడర్, టూత్‌పేస్ట్, దువ్వెన, జడక్లిప్పులు, జడరబ్బర్లు, బొట్టుబిల్లలు ఇలా పలు రకాల వస్తువులు సరఫరా చేశారు. కరోనా తర్వాత ఆరోగ్యకిట్లకు బదులు రూ.100 చొప్పున చెల్లిస్తున్నారు. ఇటీవల వసతిగృహాలు, గురుకులాల విద్యార్థుల కాస్మెటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్, కాస్మెటిక్ చార్జీలు చెల్లించాలని పలువురు కోరుతున్నారు.

మెస్ చార్జీలు పెంచాలి

పెరిగిన ధరలకు అనుగుణంగా కేజీబీవీల్లో డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచాలి. ఇటీవల ప్రభుత్వం హాస్టళ్లు, గురుకులాల్లో పెంచిన డైట్, కాస్మెటిక్ చార్జీలు కేజీబీవీలకూ వర్తింపజేయాలి. డైట్ చార్జీలు పెంచడం వల్ల విద్యార్థినులకు పౌష్టికాహారం అందించవచ్చు. విద్యార్థినులపై ఆర్థిక భారం పడకుండా ఇప్పుడు చెల్లిస్తున్న నగదు రూ.100కు బదులు ఆరోగ్య కిట్లు సరఫరా గానీ, కాస్మెటిక్ చార్జీలు పెంచాలి.

– శ్రీకాంత్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

క్లుప్తంగా

టిప్పర్ బోల్తా... వ్యక్తి మృతి


అల్తాఫ్(ఫైల్)

ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో బుధవారం టిప్పర్ బోల్తాపడింది. ఈ సంఘటనలో ఒకరు మృతిచెందినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. మండలంలోని తరోడా గ్రామానికి చెందిన అల్తాఫ్(42) మృతిచెందాడు. తన సొంత టిప్పర్‌తో మొరాన్ని తరోడా నుంచి బాసర వైపుకు తీసుకెళ్తుండగా అతివేగం, అజాగ్రత్త కారణంగా ముధోల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో బోల్తాపడింది. ఈ ఘటనలో అల్తాఫ్ ఇరుక్కు పోయి మృతి చెందాడు. సుమారు గంట పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మృతుడికి భార్య , ఇద్దరు కొడుకులు, కూతురున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లేశ్ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్‌కు చెందిన మహ్మద్ మోహిన్ (16) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక అశోక్‌రోడ్‌కు చెందిన ఎండీ షరీఫ్, పర్వీన్ బేగం దంపతుల రెండో కుమారుడు ఎండీ మోహిన్ స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఇంట్లోని బాత్‌రూమ్‌లో విద్యుత్ బల్బు పని చేయకపోవడంతో హోల్డర్‌ను సరిచేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి షరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరి బైండోవర్

జన్నారం: వేర్వేరు ఘటనల్లో ఇద్దరిని బైండోవర్ చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. మండలంలోని పుట్టిగూడకు చెందిన లక్ష్మణ్ అక్రమంగా చెట్లు నరుకుతూ స్మగ్లింగ్ చేస్తున్నాడని, చింతగూడకు చెందిన చెందిన పానగంటి శ్రీనివాస్ తన ఇంట్లో కలప అక్రమంగా నిల్వ చేసుకున్నాడని తెలిపారు. వీరిద్దరిని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

కుస్తీ పోటీలకు విద్యార్థిని ఎంపిక


నైతికతో పాఠశాల సిబ్బంది

దండేపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 జాతీయస్థాయి కుస్తీ పోటీలకు దండేపల్లి మండలంలోని కన్నెపల్లి మదర్‌థెరిసా ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని పి.నైతిక ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అనూప్ జార్జ్, మేనేజర్ షైన్, కరస్పాండెంట్ లింటో, పీఈటీ దీపిక తెలిపారు. నారాయణపేట జిల్లా దన్వాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి గెలుచుకుని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 15 నుంచి 19 వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

బాలలు భళా..!

- వివిధ రంగాల్లో ప్రతిభ
- నేడు బాలల దినోత్సవం

మంచిర్యాలఅర్బన్: బాలలు చదువులో ఉన్నతంగా రాణించాలంటే కళలు, ఆటలు, ఇతర వ్యాపకాలు ఎంతో అవసరం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విభిన్న రంగాల్లో ప్రతిభను చాటుతున్నారు. ఇన్‌స్పైర్, సకురా సైన్స్, నృత్య పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభతో ఔరా అనిపిస్తున్నారు. నేడు బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.


ప్రధాని మోదీ టీ అమ్మిన హోటల్ వద్ద రైల్వేట్రాక్‌పై విష్ణువర్ధన్

ఇద్దరు విద్యార్థుల 'ప్రేరణ'


దర్శిని బజాజ్

మారుమూల ప్రాంతంలో చదివినా ప్రతిభకు కొదవలేదని నిరూపించారు. ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన ప్రాంతాన్ని సందర్శించే అవకాశంతోపాటు స్వాతంత్ర్య దినోత్సవం రోజున నరేంద్రమోదీ జాతీయ జెండా ఎగురవేసే ఎర్రకోటకు వెళ్లే అరుదైన అవకాశాలను దక్కించుకున్నారు. కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ప్రేరణ కార్యక్రమంలో ప్రతిభ చూపడంతో ఇద్దరు విద్యార్థులకు ఆ అవకాశం దక్కింది. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్ 10న వికసిత్ భారత్ ప్రేరణ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిల్లో జిల్లా పరిషత్ కిష్టాపూర్ పాఠశాల విద్యార్థి ఆర్.విష్ణువర్ధన్, చెన్నూరు చిన్నముస్ని పాఠశాలకు చెందిన దర్శిని బజాజ్ ఎంపికయ్యారు. గుజరాత్ రాష్ట్రంలోని ప్రధాని మోదీ నివసించిన ఇల్లు, రైల్వేస్టేషన్, టీ అమ్మిన హోటల్, చదువుకున్న పాఠశాల, పనిచేసి దుకాణంతోపాటు సూర్యభగవాన్ ఆలయం, చారిత్రక కట్టడాలు సందర్శించారు. ఆగస్టు 15న స్వాతంత్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

కూచిపూడి నాట్యమయూరి

- నృత్య పోటీల్లో సహస్ర ప్రతిభ
- ఎన్నో బహుమతులు కైవసం


బహుమతి అందుకుంటున్న సహస్ర(ఫైల్)

జన్నారం: నృత్యం అంటే మక్కువ. తల్లి నృత్య కళాకారిణి కావడంతో కూతురూ కూచిపూడి నృత్యంలో రాణిస్తోంది. రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో ఎన్నో బహుమతులు సొంతం చేసుకుంది. జన్నారం మండలం పొనకల్‌కు చెందిన గాజుల నర్మద, రమేశ్ దంపతుల కూతురు సహస్ర(13) ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. నర్మద కూచిపూడి నృత్యంలో డాక్టరేట్ పొంది జన్నారంలో నటరాజ కళాక్షేత్రం నిర్వహిస్తూ నృత్యంలో శిక్షణ ఇస్తుండగా.. సహస్ర తల్లి వద్దే శిక్షణ పొందుతోంది. మంచిర్యాల జిల్లాతోపాటు కరీంనగర్, హైదరాబాద్, తిరుపతి, కాశీ వంటి ప్రదేశాల్లో జరిగిన కూచిపూడి, జానపద నృత్య పోటీల్లో ప్రతిభను చాటుకుంది.

- ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఢిల్లీలో జరిగిన నృత్య పోటీల్లో కాంతార వేషధారణతో అక్కడి గవర్నర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంది.
- హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో ప్రత్యేక కూచిపూడి కేటగిరి నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది.
- తిరుపతిలో జరిగిన సిటిజన్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన నృత్య పోటీల్లో మొదటి బహుమతి పొందింది.
- ఇటీవల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళోత్సవ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతి సాధించింది.

కూచిపూడిలో డాక్టరేట్ పొందాలని ఉంది

ఒకవైపు చదువుకుంటూనే అమ్మ సహాయంతో నృత్య పోటీల్లో పాల్గొంటున్నాను. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కేటగిరిల్లో జరిగిన పోటీల్లో బహుమతులు సాధించాను. కూచిపూడి నృత్యంలో డాక్టరేట్ పొందాలని నా కోరిక.
– సహస్ర, విద్యార్థిని


ఢిల్లీలో కాంతార నృత్య ప్రదర్శన(ఫైల్)

ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు


పట్టుకున్న బియ్యంతో విజిలెన్స్ అధికారులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సమీర్ ట్రేడర్స్‌లో కరీంనగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన 98 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. సంబంధిత వ్యక్తిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి దినేశ్‌రెడ్డి తెలిపారు. ఇందులో విజిలెన్స్ ఏఎస్‌వో ప్రశాంత్‌రావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామారావు తదితరులు ఉన్నారు.

నగదు డిపాజిట్ చేస్తుండగా చోరీ

భైంసాటౌన్: బ్యాంక్‌లో నగదు డిపాజిట్ చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తి నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.50 వేలు అపహరించిన ఘటన పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో బుధవారం జరిగింది. పట్టణానికి చెందిన సురేశ్ ఈనెల 11న నిర్మల్ రోడ్‌లోని ఎస్బీఐలో రూ.90 వేలు డిపాజిట్ చేసేందుకు రాగా, ఫాం నింపుతున్న క్రమంలో డబ్బు ఉన్న బ్యాగ్‌లోని నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కొద్ది సేపటికి సురేశ్ బ్యాగు చూడగా, అందులో రూ.50 వేలు కనిపించకపోవడంతో షాక్ అయ్యాడు బ్యాంక్ సీసీ పుటేజ్ పరిశీలించగా ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా తిరిగిన దృశ్యాలు నమోదయ్యాయి. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోసిని గ్రామ సమీపంలో బుధవారం మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై మహేందర్ తెలిపారు. పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీకి చెందిన మహ్మద్ ఎక్బాల్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కాపరువైరు దొంగల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణుచందర్

జైపూర్: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ మోటార్ల కాపర్ వైరు చోరీకి పాల్పడిన వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీధర్ వివరాలు వెల్లడించారు. సీసీసీ నస్పూర్‌కు చెందిన మోటం తిరుపతి, ఏవేల అంజి ఉదయం ఉల్లిగడ్డల వ్యాపారానికి పలు గ్రామాల్లో తిరుగుతూ పొలాల వద్ద వైర్లను గమనిస్తుంటారు. కాపర్‌వైర్ల చోరీకి పాల్పడి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరిని అరెస్టు చేసి 20కిలోల కాపర్‌వైరును స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసులను చేధించిన ఎస్సై శ్రీధర్, క్రైం పార్టీ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

ఖోఖో ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక


ఉమ్మడి ఆదిలాబాద్ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్ 14 జోనల్ స్థాయి ఖోఖో ఎంపిక పోటీలు లక్ష్మణచాంద ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. అండర్ 14 జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. శంకర్, సురేందర్, యాదవ్‌సాప్, గణేశ్, రాంబాబు, శివచరణ్, హనుమంతు, శివసాయి, తేజ, అక్షిత్ కుమార్, వర్షిత్, వేణు, భీమేశ్, అనిల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.


నదిలో దీపాలు వదులుతున్న భక్తులు

పెన్‌గంగలో కోటి దీపోత్సవం


ఉత్సవమూర్తులతో తరలివస్తున్న భక్తులు

కార్తికమాసం సందర్భంగా భీంపూర్ మండలం వడూర్ శివారు పెన్‌గంగ తీరంలో కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్లి(టి) రామాలయ వ్యవస్థాపకులు శివానంద భారతీస్వామి ఆధ్వర్యంలో భక్తులు ఉత్సవమూర్తులతో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. నదికి హారతి ఇచ్చి దీపాలను అందులో వదిలి మొక్కులు తీర్చుకున్నారు. మండలవాసులతో పాటు మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో తరలివచ్చారు. – తాంసి

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని దీపాయిగూడ గ్రామానికి చెందిన మావురపు జీవన్ (45) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై ఆత్మారాం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జీవన్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీరుతాయో లేదోనని మనస్తాపానికి గురైన ఆయన మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మహారాష్ట్రకు చెందిన ఒకరు..

మహారాష్ట్రలోని పటోర గ్రామానికి చెందిన మనోజ్ (35) మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. ఐదెకరాల్లో పత్తి పంట సాగు చేయగా, పంట ఎదుగుదల లేకపోవడంతో దిగాలు చెందాడు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు.

బాలికపై అత్యాచార యత్నం

మంచిర్యాలక్రైం: బాలికపై అత్యాచారానికి యత్నించిన ఓ వ్యక్తిపై బుధవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన రాజేందర్ బాలిక(11)కు మంగళవారం రాత్రి మాయమాటలు చెప్పి హైటెక్ సిటీ సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లాడని పేర్కొన్నారు. అత్యాచారానికి యత్నించాడని బాధితురాలు కుటుంబ సభ్యులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా గోదావరి హారతి


గోదావరి నదికి హారతి ఇస్తున్న అర్చకులు

బాసర : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసరలో గోదావరి హారతిని బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. నదీ తీరానగల సూర్యేశ్వర స్వామి ఆలయంలో వైదిక బృందం జ్వాలాతోరణ కార్యక్రమం ముందుగా నిర్వహించారు. అనంతరం అర్చకులు నదికి హారతి ఇచ్చారు. భక్తులు హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

సర్వీస్‌బుక్‌లో ఎంట్రీకి లంచం

- బిల్ కలెక్టర్ వద్ద రూ.20 వేలు డిమాండ్ చేసిన జూనియర్ అసిస్టెంట్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- రూ.15 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

నిర్మల్: తమ సొంత శాఖలో పనిచేసే బిల్ కలెక్టర్ వివరాలు సర్వీస్ బుక్‌లో నమోదు చేయడానికి కూడా రూ.20 వేలు లంచం అడిగిన ప్రబుద్ధుడు రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఘటన నిర్మల్‌లో బుధవారం జరిగింది. నిర్మల్ మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్ షాకీర్‌ఖాన్ బిల్ కలెక్టర్ నుంచి రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు బుధవారం పట్టుకున్నారు. కరీంనగర్ డివిజన్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, బాధితుడు భరత్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రానికి చెందిన భరత్ కారుణ్య నియామకం కింద నిర్మల్ మున్సిపల్‌లో బిల్‌కలెక్టర్‌గా నియామకమయ్యాడు. ఉద్యోగ వివరాలను సర్వీస్‌బుక్‌లో ఎంట్రీ చేయాల్సి ఉంది. ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ చూసే షాకీర్‌ఖాన్ తనకు రూ.20 వేలు ఇస్తేనే పనిచేస్తానని చెప్పాడు. రెండు నెలలుగా భరత్ బతిమాలుతున్నా పట్టించుకోలేదు. చివరకు రూ.15 వేలు ఇస్తేనే చేస్తానని చెప్పడంతో అంగీకరించాడు. దీంతో భరత్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బుధవారం ఉదయం బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

కొనసాగుతున్న కౌన్సెలింగ్

నస్పూర్: సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు సర్ఫేస్‌లో గల 16 డజిగ్నేషన్లలో ఉద్యోగాలపై ఇస్తున్న కౌన్సెలింగ్ బుధవారం కొనసాగింది. కౌన్సెలింగ్‌లో మొత్తం 85 మంది మహిళా బదిలీ వర్కర్లు జనరల్ మజ్దూర్లుగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం శ్రీధర్ రావు, డీవైసీఎంవో రమేశ్‌బాబు, ఎస్ఈ కిరణ్‌కుమార్, అధికారులు కాంతారావు, మల్లయ్య, రవీందర్, చంద్రలింగం, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీస్ అధికారుల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏజెల్ల శ్రీనివాస్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న ఏజెల్ల శ్రీనివాస్

మంచిర్యాలక్రైం: రిటైర్డ్ పోలీస్ అధికారుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రిటైర్డ్ పోలీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏజెల్ల శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ క్లబ్‌లో జిల్లా రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి ఎంప్లాయిమెంట్ హెల్త్ స్కీంలో ఉన్న స్కీంలను ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. ఉద్యోగులకు హెల్త్ స్కీంకు సంబంధించి రూ.800 అలవెన్స్ ఇస్తారని, దానిని రూ.వెయ్యికి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2024 మార్చి తరువాత నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పీఎఫ్, గ్రాట్యుటీ, ఈఎల్ఎం టాక్స్‌మెంట్, గ్రాట్యుటీ కమిషన్‌కు సంబంధించిన నగదు రాక అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ విడుదల చేయాలని, ఆదాయ పన్ను పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ద్వారా క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ అందించాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాలో కార్యవర్గాల ఏర్పాటు అనంతరం రాష్ట్ర సమావేశం నిర్వహించి డిమాండ్లను ఎమ్మెల్యే, మంత్రులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. సమావేశంలో జనరల్ సెక్రెటరీ ఎం.రాజమల్లారెడ్డి, గౌరవ అధ్యక్షుడు సీహెచ్.రాజమౌళిగౌడ్, ఉపాధ్యక్షుడు టి.వేణుగోపాలస్వామి, సంయుక్త కార్యదర్శి ఎండీ.తాహెరుద్దీన్, మంచిర్యాల గౌరవ అధ్యక్షుడు జే.నారాయణరావు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిటైర్డ్ పోలీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

తుపాకీతో బెదిరించి చోరీకి యత్నం


సీసీపుటేజీలో నమోదైన దొంగల దృశ్యం

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలోని అడ్డకూరి రమేశ్ అనే వ్యాపారి ఇంటి వద్ద తుపాకీతో బెదిరించి దొంగతనానికి ప్రయత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. రమేశ్‌కు చెందిన వైన్స్ దుకాణంలో పనిచేసే లక్ష్మణ్‌గౌడ్ రోజూ దుకాణం బంద్ చేసిన తర్వాత డబ్బులను తీసుకొచ్చి రమేశ్‌కు అప్పగించేవాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి దుకాణం మూసేసిన తర్వాత లక్ష్మణ్‌గౌడ్ డబ్బులు తీసుకుని బైక్‌పై వచ్చి రమేశ్ ఇంటిముందు ఆగాడు. అప్పటికే కాచుకొని ముసుగులతో ఉన్న ఇద్దరు దొంగలు లక్ష్మణ్‌ను తుపాకీతో బెదిరించగా తప్పించుకుని ఇంటిలోపలికి పరిగెత్తాడు. వెంటనే దొంగలు బైక్ కీ తీసుకొని స్కూటీపై పారిపోయారు. సీసీపుటేజీ ఆధారంగా పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై సతీశ్ దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

విషమంగానే శైలజ ఆరోగ్యం

వాంకిడి: హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. శైలజతో పాటు నిమ్స్‌లో చికిత్స పొందిన జ్యోతి, మహాలక్ష్మి పూర్తిగా కోలుకోవడంతో మంగళవారం వారిని డిశ్చార్జ్ చేసినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. అయితే శైలజ ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను ఫోన్ చేసి తెలుసుకోగా ఆరోగ్యం మెరుగుపడలేదని, ఐసీయూలో చికిత్స అందిస్తున్నారని తెలిపారు. కాగా మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగుతోంది.